# వెలుగునీడలు

పాలమనిషి కేకతో సంజీవరావు ఉలిక్కిపడి లేచాడు. తల బద్దలుకొట్టినట్టుంది. కళ్ళు ఎర్రగా అయినవి. నీరసంగా తూలుతూ వెళ్ళి తలుపు తీశాడు. పాలమనిషి పాలు పోసి వెళ్ళింది. కాసేపు నిర్లిప్తంగా శూన్యంలోకి చూశాడు సంజీవరావు గేటు తీసుకుని రాఘవయ్య తొందర తొందరగా వస్తున్నాడు. "చీకటిలో కాఫీ చేసుకొస్తా బాబూ," అని ఆదర బాదరగా లోపలికి వెళ్ళాడతను. తూలుతూ దొడ్లోకి నడిచాడు సంజీవరావు. గులాబి మొక్కని ఒక్కటే పువ్వు విచ్చుకుని, ఎర్రగా, అందంగా వుంది. రేకలమీది మంచు బిందువులు జారి కింద గడ్డిమీద పడుతున్నాయి. "పువ్వు పూసింది!" అని ఆశ్చర్యపడ్డాడు సంజీవరావు. నిన్న మొగ్గకూడా వేసినట్టులేదు. ఎందుకు వేసుండదు. తను చూసి వుండడు సరిగ్గా.

వొళ్ళు తేలిగ్గా వుంది: నీరసంగా. తూలుతూ నిమ్మచెట్టు మొదట్లో కూచున్నాడు. గడ్డిపరకలమీద మంచు చల్లగా తగిలింది. కాళ్ళు బారచాచుకుని చేతుల్లో మొహం పెట్టుకున్నాడతను.

నిమ్మచెట్టునించి వొచ్చే వాసన అతనికి ప్రశాంతత నిచ్చింది. అనుకోకుండా సంజీవరావు "నిన్న" జ్ఞాపకం వచ్చింది. అతనికి భయం వేసింది. నిన్న లేవడంతోటే పిల్లి అరిచింది ఎక్కణ్ణించో. అతనికి భయంవేసింది పొద్దున్నే లేవటానికి. శకునాలంటే నమ్మకంవున్న మనిషతడు. అందుకని అట్లాగే పడుకున్నాడు ఎనిమిదిదాకా. గడియారం గంటకొట్టేటప్పటికి తప్పక లేవవలసి వచ్చింది. ఆఫీసు పదిగంటలికి. భూమి తల్లకిందులయినా, ప్రళయం వచ్చినా, ఏది ఏమయినా సరే పదిగంటలకి ఆఫీసులో వుండాల్సిందే. ఆఫీసరు ఆనందరావుగారంటే మరి అంత నిక్కచ్చిమనిషి. ఇంకా నిన్నటిపని మిగిలివుంది. అందుచేత మరి సంజీవరావుకి లేవక తప్పలేదు. గబగబా మొహం కడిగి ఇంత కాఫీ తాగాడు. కాఫీ తాగుతూంటే కొలమారింది గొంతుమంట పెట్టింది. సరస్వతి తలుచుకుంటూందేమో అనుకున్నాడు.

అన్నట్టు సరస్వతి దగ్గర్నుంచి ఉత్తరంవచ్చి పదిహేను రోజులయింది. ప్రసవించే రోజులు. ఆరోగ్యం ఎలాఉందో..? పెద్దాడికి జలుబుగా వుందని రాసింది. ఎలా ఉందో వెధవకి. అందులో వాడు వొట్టి అర్భకుడు. బాధకితట్టుకోలేడు. చిన్నాడికి చెవిమీద యేదో కురుపుట. తనకికూడా వొంట్లో సరిగా

లేదని, తిండి సహించటంలేదని రాసింది. వెళ్ళి చూడాలని పించింది సంజీవరావుకి; కాని యెదురుగా బల్లమీది ఫైళ్ళు వెక్కిరించాయి. ఆఫీసరు ఆనందరావుగారు గర్జించినట్లు ఉలిక్కి పడ్డాడు హెడ్ గుమాస్తా సంజీవరావు

తన చేతికింద ఆరుగురు క్లర్కులూ తనని తిట్టుకుంటారు యెప్పుడూ. తనదేముంది? తనుమాత్రం మనిషి కాదూ. వాళ్లు ఆఫీసుపని ఎక్కువచేస్తే తనకేం పొరుగుతుంది. ఆఫీసరుగారి ఆర్డరు. వాళ్ళదేం పోయింది! తనమీద ఎగురుతారు. తీరా ఆఫీస పే అనేది తన నేగా. అందరికీ ఆ శంకరానికి తనాలే మంట. తనేదో వాళ్ళపాలిటి యముడయినట్టు చెబుతాడుట అందరికీ! ఇంకా పెళ్ళి కాలేదుగా! పైలా పచ్చీసుమీదుంది వ్యవహారం. బయట కనబడితే ఆ నక్క వినయాలు చూపించినా తనో పురుగు అన్నట్టు చూస్తాడు. ఇంకో ఇద్దరిని కూడ గట్టుకుని వాళ్ళతో గుసగుసలు తనమీద! మరి ఆ శంకరం చూసే చూపులు ముళ్ళు గుచ్చుకున్నట్టుటుంది, తనికి.

తను మాత్రం. ఏం చేస్తున్నాడు. వాళ్ళకంటె ఎక్కువ వెట్టి చాకిరీయే చేస్తున్నాడే! వాళ్ళ సమస్యల్ని సానుభూతితో అర్థం చేసుకుంటున్నాడే! మరి ఎందుకు వాళ్ళకు తనమీద ద్వేషం, వాళ్ళతో మంచిగా వుందామన్నా వుండలేక పోతున్నాడే? వాళ్ళు గుమాస్తాలు. తను హెడ్ గుమాస్తా. ఇంత మాత్రానికే మనుషుల్లో అంత యీర్ష్యా ద్వేషాలు ఎందుకూ? శంకరానికి తనేమీ అపకారం చెయ్యలేదు. మరెందుకలా చూస్తాడు? తనమీద ఎందుకంత ద్వేషం?

సంజీవరావుకి తల బ్రద్దలుకొట్టినట్లయింది. టంగ్ మని గడియారం అరగంట కొట్టింది. ఉలిక్కిపడి ఫైలు ముందుకి లాక్కున్నాడు సంజీవరావు.

"నమస్కారమండి!" తలెత్తి చూశాడు సంజీవరావు ఎదురుగా శంకరం "హా, ఆ శంకరం. రా! కూర్చో" "ఫరవా లేదులెండి" అందులో ఒకరకమయిన జుగుప్స ధ్వనించింది. "నువ్వు హెడ్‌క్లార్కువిగా!" అని వెక్కిరించినట్లయింది. తను శంకరాన్ని తోటి మనిషిగా గౌరవించాడు. దాన్ని అతడు క్లర్కు హెడ్‌క్లార్కు హోదాలో నిరాకరించాడు" "రాఘవయ్యా! రెండు కాఫీ" అని "ఫరవా లేదు కూర్చోవోయ్!" అని కుర్చీ లాగాడు సంజీవరావు. 'కొంచం పనుంది వొస్తానండి, రేపు గుడివాడలో మా స్నేహితుని పెళ్ళి. తప్పక వెళ్ళాలి..."

సంజీవరావు కేం పాలుపోలేదు. ఎల్లుండి 'ఇన్‌స్పెక్షన్' కనుక పని పూర్తిచేసి సిద్ధంగావుండాలని తనకు ఆఫీసరుఆనందరావుగారి హుకుం. ఈ పరిస్థితుల్లో సెలవు యివ్వాలా వద్దా అని నిర్ణయించడం కష్టం. అసలే శంకరం తనమీద కుర్రగా వున్నాడు.

రాఘవయ్య కాఫీ పట్టుగొచ్చాడు. 'ఇప్పుడే తాగి వస్తున్నానండి." "సరే, సంగతి ముందు చెప్పు అన్నట్లు వుంది శంకరం ధోరణి. చూద్దాం! కాఫీ తాగు," అనేప్పటికి అయిష్టంగానె కాఫీ తాగేశాడు శంకరం. "సరె!" నీ ఫైళ్ళన్నీ

నాకివ్వు. రేపటికి నీ పనికూడా నేను చేస్తాను. కాని ఒక్క విషయం. నువ్వెన్నింటి కెళ్ళాలి? "పన్నెండు గంటలకి బండి వుంది' "సరే. నీ ఫైళ్ళన్నీ చలమయ్యకివ్వు. నేను తీసుకుంటాను" సంతృప్తిపడి శంకరం వెళ్ళిపోయాడు.

గడియారం తొమ్మిదిన్నర కొట్టింది, సంజీవరావుకి మనసులో భయం వేసింది. కారణం అతనికికూడా తెలియదు. గబగబా స్నానంచేసి భోంచేసి ఆఫీసుకి వెళ్ళేప్పటికి అయిదు నిమిషాలు తక్కువ పదయింది. తను వెళ్ళేప్పటికి శంకరం తన డ్రాయరులోంచి ఫైళ్ళు తీసుకున్నాడు గుమ్మంలో టకటక మని చప్పుడయింది. లేచి నిలబడ్డాడు సంజీవరావు. ఆఫీసరు ఆనందరావు టకటక మంటూ వచ్చేస్తున్నాడు. మిగతా వాళ్ళంతా తలొంచి ఫైళ్ళల్లో మునిగిపోయారు. ఒక్క శంకరం మాత్రం నిలబడి ఫైళ్లు తీస్తున్నాడు. ఆయనదృష్టి క్షణకాలం అటు ప్రవర్తించింది. తన గదికేసి పోయారాయన. బంట్రోతు అప్పన్నవొచ్చి చెప్పాడు దొరగారు పిలుస్తున్నారని. సంజీవరావు వెళ్ళేసరికి, ఆఫీసరు మొహం, కందగడ్డలా చేసుకుని "ఆ శంకరం అలా నిలబడి వున్నాడేం?' అన్నాడు. 'ఇవ్వాళ సెలవు పెట్టాడండి' 'సెలవు' ఎవరిచ్చారు సెలవు అతడికి ఎల్లుండి ఇన్స్పెక్షనని తెలీదూ? చచ్చినంతపని వుంది. కాస్త మతుం డొద్దుటయ్యా నీకయినా!" తలవొంచుకున్నాడు సంజీవరావు. "వీల్లేదు. సెలవులేదు. గిలవ లేదు. ఇవిగో యివి కూడా యివాల్టికి పూర్తికావాలి." బల్లమీది దొంతరచూపించాడు ఆఫీసరు. ఎల్లుండే ఇన్స్పెక్షన్.

ఫైల్లు పట్టుకొని బయటికి వెళ్ళేసరికి శంకరం నవ్వుతూ ఎదురయి "ఇహ నేను వెడతానండి" అన్నాడు. నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు సంజీవరావుకి. "మిస్టర్! శంకరం! అయామ్ సారీ!" అని తలవొంచుకున్నాడు. శంకరానికి అర్థం కాక తెల్లపోయాడు. "అర్జెంటండి! తప్పకుండా వెళ్ళాలి." అన్నాడు. కాసేపటికి అర్థం చేసుకొని "నీ సంగతి తెలుసులే. నువ్వు తేనెపూసిన కత్తివి. తడి గుడ్డతో గొంతుకోసేరకం" అన్నట్లు చూస్తూ విసురుగా వెళ్ళి తన చైర్లో కూర్చున్నాడు.

సంజీవరావు నిర్లిప్తంగా చూసి తన ఫైళ్ళల్లో మునిగి పోయాడు. మనసు కల్లోలంగా వుంది. టెలిగ్రామ్! సార్! పోస్టుమాన్ గుమ్మంలో ప్రత్యక్షం. "ఎవరికి" అన్నట్టు ఆరుగురు క్లార్కులూ తలెత్తి చూశారు." సంజీవరావు, హెడ్ క్లార్కు" అని పోస్టుమాన్ టెలిగ్రామిచ్చి వెళ్ళిపోయాడు. క్లార్కులూ ఫైళ్ళలో మునిగారు. శంకరం గుర్రుగా చూసి పక్కవాడికేసి కన్నుకొట్టాడు.

"పనెగెయ్యటానికి టెలిగ్రాం తెప్పించుకున్నాడు రోయ్!" అన్నట్లు చూశాడు అందరికళ్ళల్లోకి.

సంజీవరావు చేతులు వొణికాయ్! మనస్సు బిగబట్టి టెలిగ్రాం చించాడు. "సరస్వతి... సీరియస్... హాస్పిటల్... కమ్" తల తిరిగిపోయింది. మామగారిచ్చారు "భగవాన్" అనుకొన్నాడు. మనస్సు బిగబట్టుకోటానికి ప్రయత్నించాడు. దీనికి తట్టుకొనే మనస్థయిర్యం ప్రసాదించమని భగవంతుని ప్రార్థించాడు. గుండె చిక్కబట్టుకుని ఫైళ్ళ ప్రపంచంలో

మునిగిపోయాడు సంజీవరావు "టెలిగ్రామట! ఎవరికి?" ఆఫీసరుగారు కబురుపంపించారు 'నాకే' వాలిపోయిన మొహంతో సమాధానమిచ్చాడు సంజీవరావు.

సాయంత్రం నాలుగున్నరయింది. అందరూ సర్దుకుంటున్నారు. సంజీవరావు ఇంకా రాలేదు. "సంజీవరావ్! టెలిగ్రామొచ్చిందట" ఆఫీసరు అడిగారు 'అవునండి' 'ఏదీ చూడనీ' వొణుకుతూ అందించాడు సంజీవరావు. చదివిం తర్వాత కాసేపు ఆశ్చర్యంగా అతన్ని చూసి వెళ్ళిపోయాడు ఆఫీసరు. "అయిదయిందండి" గుమస్తా చలమయ్య చెప్పాడు. దగ్గరకొచ్చి "పైళ్ళుసర్ది చంకలో పెట్టుకుని అనుసరించాడు సంజీవరావు." "పాపం! శంకరానికి సెలవివ్వకపోవడం అన్యాయమండి. ఏమనుకోనుంటే ఒకటి చెబుతానండి."

"చెప్పు చలమయ్యా! ఎందుకనుకుంటాను."

"నేను నమ్మలేదుగాని ఇదంతా మీరు చేయించిందేననుకుంటున్నానండి."

సంజీవరావు ఒక నిముషంసేపు అయోమయంలో పడ్డాడు. ఏంచెప్పాలో తోచలేదు, అప్రయత్నంగా జేబులోనుంచి టెలిగ్రాంతీసి అతనిచేతిలో పెట్టాడు. నిశ్శబ్దంగా తల వొంచుకుని అతనిపక్కనే నడిచాడు.

"చలమయ్యా! ఎంతమంచిగా ఉండాలని ప్రయత్నించినా, మనిషి చెడ్డవాడుగానే పరిగణింపబడడానికి కారణం... ఇదే... వేధిస్తున్నదయ్యా, నన్ను... బరువుగా బాధగా ధ్వనిం

చిన ఈ మాటలకి చలమయ్య జాలిపడ్డాడు. అంతకంటె ఏం చెయ్యాలో తోచలేదు అతడికీకూడా. కొంతదూరం నడిచి సెలవుతీసుకొని చలమయ్య వెళ్ళిపోయాడు.

రోడ్డుపక్కగా నడుస్తున్నాడు సంజీవరావు. అతని మనస్సు అల్లకల్లోలంగా ఉంది రయ్‌మంటూ దూసుకొచ్చిందో టాక్సీ ఎవరో పక్కకిలాగారు హఠాత్తుగా సంజీవరావుని. బ్రేక్ పడకపోవటంవలన అది పక్కగా దూసుకెళ్ళి ఇసకలో పడుకున్న కుక్కమీదుగా వెళ్ళింది "కుయ్యో" మని బాధగా అరిచిన కుక్క అప్పటికప్పుడే ప్రాణాలు వొదిలింది. అప్పటికే కారు మైలుదూరాన అదృశ్యమయిం , ఎవరికీ పట్టనట్టు జనం ఎవరిదారిన వారు పోయారు.

కొంచెంలో తప్పిందిగాని లేకపోతే తనుకూడా ఇల్లాగే ...ఇహ ఊహించుకోలేకపోయాడు సంజీవరావు. తరువాత ఏమయితే ఎవరికిగావాలి.

బరువుగా పైళ్లుదించి తలుపుతీశాడు సంజీవరావు. ఒక ఉత్తరంజారి కిందపడింది, తమ్ముడుపరీక్ష పోయిందట, ఏం చెయ్యనన్నయ్యా" అని రాశాడు దీనంగా.

ఎనిమిదింటికి హోటలునుంచి కారియరు వొచ్చింది. అన్నం సహించలేదు. నిరసంగా కుర్చీలో కూర్చున్నాడు పైళ్ళముందు. పడుకోబోయేటప్పటికి రాత్రి ఒంటిగంట కొట్టింది బద్ధకంగా నడుంవాల్చాడు నిద్రపట్టలేదు. పాడు ఆలోచనలు, కలతనిద్ర. సరస్వతి పిల్లలు శంకరం ఆఫీసుపని!

ఇదీ 'నిన్న!' ఈ 'నిన్న' వొద్దనుకున్నా సంజీవరావుని వొదిలిపెట్టలేదు. నిమ్మఆకు మీదినుంచి వో మంచుబిందువు రాలి కంటిమీదపటింది చల్లగా, అయోమయంగా కూర్చుండి పోయాడు సంజీవరావు. కాఫీ తెచ్చియిచ్చాడు రాఘవయ్య. రుచిగావుంది. మనస్సు ప్రశాంతంగావుంది. యెందుకో తనకే తెలీదు. స్నానంచేసి పైళ్ళు సర్దుకునేటప్పటికి తొమ్మిదయింది ఆఫీసుకి బయలుదేరబోతూండగా వీధితలుపు తెరుచుకొని చలమయ్యా, శంకరం వొచ్చారు.

"మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నానండి... చలమయ్యగారు అంతా చెప్పారు" తలవంచుకుని అన్నాడు శంకరం. నవ్వొచ్చింది సంజీవరావుకి. "ఫరవాలేదు అపోహ పడడం మానవనైజం. తెలుసుకున్నావు అదిచాలు. నాకు తృప్తిగవుంది" అని కాఫీలు తెప్పించాడు సంజీవరావు. ముగ్గురూ తృప్తిగా కాఫీతాగారు.

"నిన్న ఇతను బయలుదేరవలసినబండి పట్టాతప్పిందండి చాలా ప్రమాదంజరిగింది. అదృష్టవంతుడు శంకరం" అన్నాడు చలమయ్య. "అంతా విధివిధానం" అన్నాడు సంజీవరావు.

ముగ్గురూ కలిసి ఆఫీసుకు బయలుదేరారు. "టెలిగ్రామ్స్‌సార్! అన్నాడు పోస్టుజవాను, చలమయ్యా, శంకరం చెరొకటి అందుకొని చింపారు. "సరస్వతీ... డెలివర్డు బాయ్ - సేఫ్" అని చదివాడు చలమయ్య. "ఎగ్జామ్... మిస్టేక్... పాస్ హేపీ..." అని చదివాడు శంకరం. వొకటి మామగారినుంచీ రెండోది తమ్ముడినుంచీ.

సంజీవరావు గాలిలో తేలినట్లయిపోయాడు. ఇద్దరిబుజాల మీాదా చేతులేసి "నన్ను మీా తోటిమనిషిగా అర్థంచేసుకోండి నేను మీా స్నేహితుణ్ణి" అన్నాడు. "ఆసంగతి మాకు తెలుసు. కాకపోతే తెలీక అపోహపడతా అప్పుడప్పుడూ" అన్నాడు. చలమయ్య. శంకరం సిగ్గుగా తలొంచుకున్నాడు.

ఆ మధ్యాహ్నం ఆఫీసులో ఆఫీసరునిపిలిచి "నిన్నేమ నాలో నాకు తెలీడంలేదు. ఇన్నాళ్ళూ నిన్నర్థంచేసుకోలే పోయాను. ప్రొమోషన్‌లిస్టులో నీపేరు మొదట వేస్తున్నాను! నాకు చాలా సంతోషంగాఉంది! ఎందుకంటే నేను చేస్తున్నది నా విద్యుక్తధర్మంకనుక" అన్నాడు!

సంజీవరావుకి ఏమనాలో తెలీలేదు. చీకటివెలుగుల్లో తికమకపడి "జీవితమే ఇంత" అని గొణుక్కున్నాడు తనలో.

—●—